## సింగరేణి కొత్తగూడెం ఏరియా

# నూతన జీఎంగా శాలెంరాజు బాధ్యతల స్వీకరణ



కొత్తగూడెం ఏరియా జీఎంను స్వాగతిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు



ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

రామవరం, జూన్ 19: సింగరేణి కొత్తగూడెం ఏరియా జీఎంగా సోమవారం శాలెంరాజు బాధ్యతలు తీసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకిత భావంతో విధులు నిర్వర్తించి సంస్థ లక్ష్యాలను అధిగమిస్తానన్నారు. ఉద్యోగులు, అధికారుల సహకారంతో ఉత్పత్తి, రవాణాలో ఏరియాను అగ్రస్థానంలో నిలుపుతానన్నారు. జీఎంకుటీబీజీకేఎస్ 11 మెన్ కమిటీ మెంబర్ కృష్ణ, నాయకులు జోసఫ్, భీముడు, సూరిబాబు, రమణ, గురుస్వామి, కృష్ణ స్వాగతం పలికారు.

**ఇల్లెందు ఏరియా నూతన జీఎంగా జాన్ ఆనంద్..**

ఇల్లెందు రూరల్, జూన్ 19 : సింగరేణి ఇల్లెందు ఏరియా నూతన జీఎంగా సోమవారం జాన్ ఆనంద్ పదవీ బాధ్యతలు చేపట్టారు. సోమవారం జీఎం కార్యాలయంలో జీఎం దంపతులకు అధికారులు, ఉద్యోగులు స్వాగతం పలికారు. ఏరియాలో బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఉత్పాదకత పెంచేందుకు అహర్నిశలు కృషి చేస్తానని జీఎం తెలిపారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారులు పంజాల శ్రీనివాస్, గిరిధర్‌రావు, వెంకటేశ్వర్లు, ప్రహ్లాద్, జీవీ మోహన్‌రావు, వెంకట రామచంద్ర, విజయ్, శేఖర్‌బాబు, ఆనంద్, క్రిష్టాఫర్, బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

## 'తెలంగాణ బుక్' అందుకున్న ఎమ్మెల్యే సండ్ర



ప్రగతి పుస్తకం అందుకుంటున్న ఎమ్మెల్యే సండ్ర, చిత్రంలో సీఎం కేసీఆర్

సత్తుపల్లి, జూన్ 19: తెలంగాణ దశాబ్ది వేడుకల్లో నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన 'మెర్క్యూరియల్ రైస్ ఆఫ్ తెలంగాణ' పుస్తకాన్ని సోమవారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హైదరాబాద్‌లోని సచివాలయంలో ముఖ్యమంత్రి కేసీఆర్, చీఫ్ సెక్రటరీ శాంతకుమారి చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్ర పౌర సంబంధాలు, సమాచారశాఖ ఈ పుస్తకానికి రూపకల్పన చేసింది.

## భద్రత నియమాలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇల్లెందు రూరల్, జూన్ 19: బొగ్గు ఉత్పత్తి రవాణాలో కార్మికులు భద్రతా నియమాలు పాటించాలని జేకే ఉపరితల గని సేఫ్టీ అధికారి శివప్రసాద్ సూచించారు. సోమవారం గని పరిధిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే వారు డాక్టర్లు సూచించిన విధంగా జాగ్రత్తలు పాటించి విధులకు హాజరు కావాలన్నారు. ఎండల నేపథ్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు బండి రాము, రాజయ్య, లింకన్, రాకేష్ శర్మ, సాంబమూర్తి, జీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

## మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న డైరెక్టర్లు

రామవరం, జూన్ 19: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్, డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం వారు జీకేవోసీలో హరితోత్సవం నిర్వహించారు. ఉద్యోగులు, ఇతర అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఏరియా నూతన జీఎం శాలెంరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం కోటిరెడ్డి, ఏరియా ఇంజినీర్ రఘురామిరెడ్డి, జీకేవోసీ పీవో శ్రీరమేశ్, ఏఎస్వో వెంకటేశ్వరరావు, జీకేవోసీ మేనేజర్ మురళి పాల్గొన్నారు.



మొక్కనాటుతున్న కలెక్టర్ గౌతమ్

## విద్యతోనే బంగారు భవిష్యత్తు

**కలెక్టర్ వీపీ గౌతమ్**

కొణిజర్ల, జూన్ 19: విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని, ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠశాల, సమాజానికి గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. సోమవారం ఆయన తనికెళ్ల ఉన్నత పాఠశాలలో దాతలు, ఎన్ఆర్ఐలు టి.లెనిన్ చౌదరి, జిల్లేలముడి వెంకట్ బడికి సమకూర్చిన ఐరన్‌గేట్లు, సైకిల్ షెడ్‌ను ప్రారంభించారు. 10 కంప్యూటర్లను యాజమాన్యానికి అందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్యాంసన్, వ్యవసాయాధికారి బాలాజీ, డీఎన్ఎఫ్ ఫౌండేషన్ కుటుంబ సభ్యులు రామకృష్ణ, బాబూరావు, బండి నాగేశ్వరరావు, సర్పంచ్ చల్లా మోహన్‌రావు, ఎస్ఎంసీ చైర్మన్ శ్రీను, ఎంపీటీసీ గుండ్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## నేడు ఖమ్మంలో మంత్రి పువ్వాడ పర్యటన



రఘునాథపాలెం, జూన్ 19: మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం ఖమ్మం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం జరిగే విద్యాదినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు ఆయన అదనపు ప్రత్యేక ప్రైవేటు కార్యదర్శి గౌతమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు రఘునాథపాలెం కేజీబీవీలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. 9:30 గంటలకు పాండురంగాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, 10 గంటలకు రోటరీనగర్ ఉన్నత పాఠశాలలో, 11 గంటలకు నయాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'మన బడి' అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. సాయంత్రం 4:30 గంటలకు ఎన్నెస్పీ క్యాంపులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. 5 గంటలకు ఎన్నెస్పీ క్యాంపులోని డీపీఆర్సీ కాంప్లెక్స్‌లో జరిగే విద్యాదినోత్సవంలో పాల్గొంటారు.

## రేపు 'నైతిక, మానవీయ విలువలు' పరీక్ష

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 19: ఇంటర్‌లోని 'నైతిక, మానవీయ విలువలు' పరీక్ష ఈ నెల 21న, 'పర్యావరణ విద్య' పరీక్ష ఈ నెల 22న నగరంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో జరుగుతాయని ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండింటిలో ఉత్తీర్ణత తప్పనిసరని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు ఫీజు చెల్లించని, గతంలో గైర్హాజరైన వారు నేరుగా పరీక్షలకు హాజరుకావచ్చని వివరించారు.

## ప్రతి వ్యక్తి కనీసం మూడు మొక్కలు నాటాలి

**సింగరేణి డైరెక్టర్ బలరాం**



మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్ బలరాం

కొత్తగూడెం సింగరేణి, జూన్ 19: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రతి వ్యక్తి మూడు మొక్కలు నాటాలని సింగరేణి డైరెక్టర్ (ఫైనాన్స్ అండ్ పర్సనల్) బలరాం పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సోమవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన హరితోత్సవంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో చేపట్టిన హరితహారం ప్రపంచంలోనే అతిపెద్ద పర్యావరణ హిత కార్యక్రమం అని అభివర్ణించారు. ఆయన స్ఫూర్తిగా ఎంపీ సంతోష్‌కుమార్ చేపట్టిన గ్రీన్ చాలెంజ్ ప్రపంచ ఖ్యాతి పొందిందన్నారు. సీఎండీ శ్రీధర్ ఆదేశాల మేరకు హరితహారంలో భాగంగా సంస్థ పరిధిలో 5.71 కోట్ల మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో సంస్థ మైనింగ్ అడ్వైజర్ డీఎన్ ప్రసాద్, అధికారుల సంఘం జనరల్ సెక్రటరీ ఎన్వీ రాజశేఖర్, అడ్మినిస్ట్రేటీవ్ మేనేజర్ భాస్కర్ పాల్గొన్నారు.

## భద్రాద్రి రామాలయ ముఖ్యఅర్చకుడి మృతి



గోపాల కృష్ణమాచార్యులు (ఫైల్)

భద్రాచలం, జూన్ 19: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థాన ఆలయంలో నాలుగు దశాబ్దాల నుంచి రాముని సేవలో ఉన్న ముఖ్యఅర్చకుడు పొడిచేటి గోపాలకృష్ణమాచార్యులు (63)సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతిచెందారు. కొంతకాలం క్రితం కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. ఆ తర్వాత ఇన్ఫెక్షన్ అయి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గోపాల కృష్ణమాచార్యులు మృతిచెందారు. భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

### వడదెబ్బతో వ్యక్తి ..

బూర్గంపహాడ్, జూన్ 19: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన నాగినేనిప్రోలు రెడ్డిగూడెంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాచలం పట్టణానికి చెందిన బూరుగు భాస్కర్ (42) కుటుంబ కలహాల నేపథ్యంలో రెండున్నరేళ్ల క్రితం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం వచ్చాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం వడదెబ్బకు గురైన భాస్కర్ ఇదే రోజు ఓ పొలంలోని సమాధిపై పడుకుని అలాగే ప్రాణాలు వదిలాడు. సోమవారం ఉదయం గ్రామస్తులు సమాధిపై భాస్కర్ మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

## ఇంట్లోకి దూసుకెళ్లిన టిప్పర్



ఘటనా స్థలంలో లారీ

బూర్గంపహాడ్, జూన్ 19: ఇంట్లోకి టిప్పర్ లారీ దూసుకెళ్లగా డ్రైవర్, క్లీనర్‌కు గాయాల పాలైన ఘటన మోరంపల్లిబంజరలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపురం వైపు నుంచి పాల్వంచ వైపు వెళ్తున్న టిప్పర్ మోరంపల్లిబంజర చేరుకుంటుండగా అదుపు తప్పి ఓ ఇంట్లోకి దూసుకెళ్లి ఆగింది. ఘటనలో ఇల్లు స్వల్పంగా దెబ్బతిన్నది. ఇంట్లో నిద్రపోతున్న ఓ చిన్నారికి స్వల్పగాయాలయ్యాయి. టిప్పర్ డ్రైవర్, క్లీనర్ గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను గ్రామస్తులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ఎస్సై సంతోష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## ప్రభుత్వ విప్ రేగా పర్యటనలో అపశ్రుతి

బూర్గంపహాడ్, జూన్ 19: ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సోమవారం బూర్గంపహాడ్ మండలం ముసలిమడుగు పంచాయతీ సంజెల్లరామాపురంలో నిర్వహించిన హరితోత్సవానికి హాజరై కాన్వాయ్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ముసలిమడుగు మీదు వస్తుండగా లింక్ రోడ్ నుంచి ఒక్కసారిగా ట్రాక్టర్ ప్రధాన మార్గంలోకి వచ్చింది. ఇదే సమయంలో అటుగా వస్తున్న ప్రభుత్వ కాన్వాయ్‌లోని ఓ కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుకగా వస్తున్న కారు ముందు వాహనాన్ని ఢీకొట్టింది. ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ కాన్వాయ్‌లో లక్ష్మీదేవిపల్లి పర్యటనకు వెళ్లారు.